నమస్తే తెలంగాణ
కామారెడ్డి
5 నిజామాబాద్, బుధవారం 21 ఆగస్టు 2024 KAMAREDDY



తాడ్వాయి మండల కేంద్రంలో కామారెడ్డి-ఎల్లారెడ్డి ప్రధాన రహదారిపై రాస్తారోకో చేస్తున్న రైతులు

# మూడో 'సారీ'..

## దగాపడ్డ రైతాంగం

- మూడు విడుతల్లోనూ అత్తెసరు మందికే..
- సగానికి పైగా రైతులకు వర్తించని రుణమాఫీ
- ఆవేదనకు గురవుతున్న అన్నదాతలు
- ఆందోళన బాట పడుతున్న కర్షకులు

**రైతులందరికీ** రూ.2 లక్షల లోపు మాఫీ చేస్తామన్న కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టాక ఆంక్షల కొరడా ఝళిపించింది. సవాలక్ష కొర్రీలతో సగం మంది రైతులకు రిక్త'హస్తం' చూపింది. ఏ గ్రామానికి వెళ్లినా, ఏ రైతును పలుకరించినా రుణమాఫీ కాలేదన్న ఆవేదననే వినిపిస్తున్నది. సర్కారు సాయం దక్కలేదన్న ఆందోళననే అన్నదాతల్లో కనిపిస్తున్నది. సాంకేతిక సమస్యలో.. సర్కారీ కొర్రీలో కానీ కర్షకుల ఉసురు పోసుకుంటున్నారు.

– ఏర్గట్ల/కోటగిరి/పోతంగల్, ఆగస్టు 20


రుణమాఫీ గురించి తెలుసుకోవడానికి వచ్చిన రైతులతో కిటకిటలాడుతున్న కోటగిరి ఎస్‌బీఐ

### పంద్రాగస్టు వరకు మాఫీ చేస్తా అనే..



ఏర్గట్ల, ఆగస్టు 19: నా పేరిట లక్ష రూపాయల రుణం ఉన్నది. సీఎం రేవంత్‌రెడ్డి పంద్రాగస్టులోపు రుణం మాఫీ చేస్తా అనే. కానీ ఇప్పటిదాకా నాకు రుణమాఫీ కాలేదు. అధికారులను అడిగితే నా బ్యాంక్ అకౌంట్‌కు వేరే వాళ్ల ఆధార్ కార్డు లింకు అయి ఉందని చెప్తున్నారు. నా సమస్యను పరిష్కరించి, రుణమాఫీ చేయాలి.

**- భూషణవేణి గంగాధర్ యాదవ్, రైతు, బట్టాపూర్**

### రైతులమందరం ఆందోళన చేపడతాం..



బ్యాంకులో నాకు రెండు లక్షల ఎనభై వేల రుణం ఉన్నది. నేను బ్యాంకు రుణం విషయంలో క్లియర్‌గా ఉంటా. కానీ నేను తీసుకున్న రుణం మాత్రం మాఫీ కాలేదు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం మా రుణాలు మాఫీ చేసి ఆదుకోవాలి. లేకపోతే రైతలమంతా కలిసి ఆందోళన చేస్తాం.

**- నాగిరెడ్డి రాజేందర్‌రెడ్డి, రైతు, దోంచంద**

### ఎవరినడగాలో తెల్వడంలేదు..



పొతంగల్, ఆగస్టు 19 : 2018లో రూ. 17 వేల క్రాప్‌లోన్ తీసుకున్న. ప్రతి ఏడాది రెన్యువల్ చేసుకుంటా వస్తున్న. రుణ మాఫీ చేసిండ్లని తెల్వగానే సంతోషపడ్డా. కానీ లిస్టుల చూస్తే నా పేరు లేదు. అధికారులను అడిగితే తర్వాతి లిస్టుల్లో వస్తదన్నరు. రెండో లిస్టుల, మూడో లిస్టుల కూడా నాపేరు లేదు. ఎవరిని అడగాలో అర్థమైతలేదు.

**- కొడిచర్ల చిన్నసాయిలు, రైతు, కల్లూర్**

### అన్ని కరెక్ట్‌గా ఉన్నా మాఫీ కాలె..



ఎత్తొండ బ్యాంకులో రూ. లక్ష ఐదు వేల పంట రుణం తీసుకున్నా. ఆధార్ కార్డు, పాస్ పుస్తకంలో నా పేరు, తండ్రి పేరు అన్ని కరెక్ట్‌గా ఉన్నాయి. అయినా నాకు క్రాప్ లోన్ మాఫీ కాలేదు. ఏ అధికారిని అడిగినా సరైనా సమాధానం ఇవ్వడం లేదు. వస్తది అని చెబుతున్నారు. ఎప్పుడు అస్తదో ఏమో అర్థం కావడం లేదు.

**-దివిటే పండరి, రైతు, టాక్లి**

### పేరులో ఏదో తప్పు జరిగిందని చెప్పారు..



బ్యాంకులో లక్ష రూపాయల వరకు అప్పు తీసుకున్నా. రాష్ట్ర ప్రభుత్వం రుణ మాఫీ చేసిందని తెలియగానే లిస్టులో చూసుకుంటే నా పేరు రాలేదు. అధికారులను కలిసి సమస్య ఏందని తెలుసుకున్నా. నా పేరులో ఏదో తప్పు జరిగిందని చెప్పినారు. కానీ ఇంతకుముందు ఎప్పుడూ ఇలా కాలేదు. తప్పును సరి చేసి నాకు రుణ మాఫీ చేయాలి.

**- మాదస్తు మహేశ్ యాదవ్, రైతు, తడ్‌పాకల్**

# తీరని రుణం.. ఆగని రణం

**ఉమ్మడి జిల్లాలో రైతుల ఆందోళనలు**

**రూ.2 లక్షల్లోపు రుణాలు** మాఫీ చేశామని ప్రభుత్వ మేమో ప్రకటనలు గుప్పిస్తున్నది. మరోవైపు, బ్యాంకుల్లో తీసుకున్న పంట రుణాలు మాఫీ కాలేదని రైతాంగం గగ్గోలు పెడుతున్నది. అర్హులైన తమకు మాఫీ కాలేదన్న బాధతో కర్షక లోకం కదం తొక్కుతున్నది. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో మంగళవారం కూడా రైతుల ఆందోళనలు కొనసాగాయి. ప్రభుత్వానికి వ్యతిరేకంగా రోడ్డెక్కిన రైతులు.. బ్యాంకులు, సొసైటీల ఎదుట బైఠాయించారు.

– నస్రుల్లాబాద్/నాగిరెడ్డిపేట్/మోస్రా/సారంగపూర్/ఏర్గట్ల/బోధన్ రూరల్/లింగంపేట్, ఆగస్టు 20

- ప్రభుత్వానికి వ్యతిరేకంగా రోడ్డెక్కిన అన్నదాతలు..
- బ్యాంకులు, సొసైటీల ముట్టడి
- మాట ఇచ్చి మోసగించిన సర్కారుపై సమరం
- అర్హులందరికీ మాఫీ చేయాల్సిందేనని డిమాండ్

**రుణమాఫీ** కాని రైతుల ఆందోళనలు రోజురోజుకూ ఉధృతమవుతున్నాయి. మంగళవారం కూడా ఉభయ జిల్లాల వ్యాప్తంగా నిరసనలు కొనసాగాయి. షరతులు లేకుండా రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ ఏర్గట్లలో రైతులు ధర్నా చేశారు. అక్కడకు చేరుకున్న నోడల్ అధికారి మానిషతో తమ గోడు వెల్లబోసుకున్నారు. మాకెందుకు మాఫీ కాలేదని బోధన్ మండలం కల్దుర్కిలో అన్నదాతలు నిరసన తెలిపారు. మోస్రా మండలంలోని కెనరా బ్యాంకు ఎదుట రైతన్నల ఆందోళన కొనసాగింది. మండలంలోని పలు గ్రామాలకు చెందిన రైతులు బ్యాంకు సిబ్బందిని నిలదీశారు. కేసీఆర్ పాలనలో ఎన్నడూ రోడ్డెక్కని తమను ఇప్పుడు రోడ్డు మీదకు తీసుకొచ్చారని మండిపడ్డారు. సీఐ జయేశ్, ఎస్సై కృష్ణకుమార్ రైతులకు సర్దిచెప్పారు. మరోవైపు, రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ పాల్దా సొసైటీ వద్ద రైతులు చేపట్టిన ఆందోళన మంగళవారం కూడా కొనసాగింది. సొసైటీ కార్యాలయం గేటుకు తాళం వేసి నిరసన తెలుపగా, డీసీవో శ్రీనివాస్, డీసీసీబీ సీఈవో నాగభూషణం, డీజీఎం లింబాద్రి, అగ్రికల్చర్ ఏడీ ప్రదీప్‌కుమార్ వచ్చి రైతుల సమస్యలు తెలుసుకున్నారు. అర్హులైన వారందరికీ మాఫీ వర్తించేలా చేస్తామని డీసీవో హామీ ఇవ్వగా, సంతృప్తి చెందని అన్నదాతలు ఒప్పంద పత్రం రాసివ్వాలని కోరారు. అలా రాసివ్వడం కుదరదన్న డీసీవో.. న్యాయం చేసే బాధ్యత తనదని పలుమార్లు విజ్ఞప్తి చేయగా, రైతులు శాంతించారు. కామారెడ్డి జిల్లా నాగిరెడ్డిపేటలోని వ్యవసాయ శాఖ కార్యాలయం ఎదుట తాండూర్, కన్నారెడ్డి, చీనూర్, మేజర్‌వాడీ, మాల్తుమ్మెద గ్రామాల రైతులు నిరసన తెలిపారు. మాజీ జడ్పీటీసీ మనోహర్‌రెడ్డి వారికి సంఘీభావం తెలిపారు. తాడ్వాయి మండలంలోనూ రైతుల ఆందోళన కొనసాగింది. మాఫీ చేస్తామని మోసగించిన వైనంపై అన్నదాతలు రోడ్డెక్కారు. కామారెడ్డి-ఎల్లారెడ్డి ప్రధాన రహదారిని దిగ్బంధించారు. ఆంక్షల్లేని రుణమాఫీతో పాటు రైతుభరోసా వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. నస్రుల్లాబాద్ మండల కేంద్రంలో బోధన్-బాన్సువాడ ప్రధాన రహదారిపై రైతులు రాస్తారోకో చేశారు. పోలీసులు సముదాయించడంతో ఆందోళన విరమించి, ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్ ఎదుట బైఠాయించారు. తమకెందుకు మాఫీ రాలేదని బ్యాంకు మేనేజర్ రాహుల్‌తో వాగ్వాదానికి దిగారు.

### రుణమాఫీ కాని రైతుల సంతకాల సేకరణ

బాన్సువాడ, ఆగస్టు 20: బాన్సువాడలో రుణమాఫీ కాని రైతుల సంతకాలను బీజేపీ ఆధ్వర్యంలో మంగళవారం సేకరించారు. కాంగ్రెస్ ఇచ్చిన మాట ప్రకారం రూ.2 లక్షల రుణాలను మాఫీ చేయాలని రైతుల కోసం రచ్చబండ పేరిట కార్యక్రమం నిర్వహించారు. షరతుల్లేకుండా రుణమాఫీ చేయడంతో పాటు రైతు భరోసా కింద రూ.15 వేల చొప్పున వెంటనే విడుదల చేయాలని మాజీ ఎమ్మెల్యే యెండల లక్ష్మీనా రాయణ డిమాండ్ చేశారు.



రైతులందరికీ రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ ఏర్గట్లలో ధర్నా చేస్తున్న అన్నదాతలు


మోస్రాలోని కెనరా బ్యాంక్ ఎదుట బైఠాయించిన రైతులు

# అంగన్‌వాడీలు.. ఖాళీలతో అభాసుపాలు

- భర్తీ ప్రక్రియపై ప్రభుత్వ తాత్సారం
- చిన్నారులు, గర్భిణులు, బాలింతలపై తీవ్ర ప్రభావం
- నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా భారీగా ఖాళీలు



నిజామాబాద్, ఆగస్టు 20
(నమస్తే తెలంగాణ ప్రతినిధి)
అంగన్‌వాడీ కేంద్రాల్లో టీచర్, ఆయా పోస్టులు భారీగా ఖాళీలు ఏర్పడ్డాయి. ఆయా సెంటర్లలో సిబ్బంది లేక ఇబ్బందులు కొనసాగుతున్నాయి. కొంత మంది రిటైర్డ్ కావడం, మరికొందరు పని మానుకోవడంతో ఖాళీల సంఖ్య భారీగా పెరిగింది. రేవంత్ సర్కారు మాత్రం ఖాళీల భర్తీపై నోరు మెదపడం లేదు. మొన్నటి అసెంబ్లీ సమావేశాల్లో అంగన్‌వాడీల్లో సిబ్బంది కొరతను తీరుస్తామంటూ సంబంధిత మంత్రి హామీ ఇచ్చారు. కానీ ఇంతవరకు ఆ ఊసే లేదు. సిబ్బంది కొరత కారణంగా గర్భిణులు, బాలింతలు, చిన్నారులు ఇబ్బంది పడుతున్నారు. పేద, మధ్య తరగతి కుటుంబాల వారికి అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందాల్సిన పోషకాహారం అందకుండా పోతున్నది.

**వెక్కిరిస్తున్న ఖాళీలు..**

నిజామాబాద్ జిల్లాలో ఐదు ప్రాజెక్టుల పరిధిలో 1394 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. నిజామాబాద్ అర్బన్, డిచ్‌పల్లి, భీమ్‌గల్, ఆర్మూర్, బోధన్ ప్రాజెక్టుల పరిధిలో కలిపి 96 టీచర్ పోస్టులు, 303 ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీంతో టీచర్లు, ఆయాలు లేక గర్భిణులు, బాలింతలు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సెంటర్లలో సిబ్బంది కొరత ఏర్పడిన తర్వాత ఇన్‌చార్జీలను పెట్టి కార్యకలాపాలు నిర్వహిస్తుండగా, సరైన రీతిలో పనితీరు నడవడం లేదన్న విమర్శలున్నాయి.

**దృష్టి సారించని సర్కారు..**

ఉన్నతాధికారుల నిర్లక్ష్యం మూలంగా అంగన్‌వాడీల్లో పరిపాలన గాడి తప్పింది. జిల్లా అధికారులంతా ఇతరత్రా పనుల్లో బిజీగా ఉండటంతో సెంటర్లపై పర్యవేక్షణ లేకుండా పోయింది. నిరంతర పర్యవేక్షణ లేకపోవడంతో కొందరి ఇష్టారాజ్యం నడుస్తున్నది. జిల్లా సంక్షేమాధికారి, సీడీపీవోల పట్టింపులేని తనం కూడా ఈ పరిస్థితికి కారణం. మాతా శిశు సంరక్షణలో భాగంగా గతంలో కేసీఆర్ ప్రభుత్వం విప్లవాత్మకమైన చర్యలను చేపట్టింది. పేద కుటుంబాల్లో పౌష్టికాహార లోపాన్ని నివారించేందుకు అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేసింది. కేంద్ర ప్రభుత్వం తీవ్రమైన నిర్లక్ష్యం చూ పు తు న్న ప్ప టి కీ సొంతంగా నిధులు వెచ్చించి కేసీఆర్ మాత్రం ఆడబిడ్డల బాగు కోసం కృషి చేశారు. పుట్టబోయే చంటిపిల్లల ఆరోగ్యంతో పాటుగా గర్భిణులు, బాలింతలను కాపాడుకునేందుకు అంగన్‌వాడీల్లో పౌష్టికాహారాన్ని క్రమం తప్పకుండా అందించారు. అంగన్‌వాడీల ద్వారా అందే బలవర్ధకమైన ఆహారాన్ని అర్హులైన వారంతా తీసుకునేలా గతంలో చర్యలు తీసుకోగా ఇప్పుడు అలాంటి ప్రయత్నమే జరగడం లేదు. ఎన్‌రోల్‌మెంట్ విషయంలోనూ నిర్లక్ష్యం కనిపిస్తున్నది.

| ఇదీ ఖాళీల లెక్క.. ప్రాజెక్టు | అంగన్‌వాడీ కేంద్రాలు | ప్రస్తుతం ఉన్న టీచర్లు | ఖాళీలు | ప్రస్తుతం ఉన్న ఆయాలు | ఖాళీలు |
|---|---|---|---|---|---|
| నిజామాబాద్ అర్బన్ | 152 | 132 | 20 | 129 | 23 |
| డిచ్‌పల్లి | 303 | 285 | 18 | 223 | 80 |
| భీమ్‌గల్ | 282 | 255 | 27 | 143 | 139 |
| ఆర్మూర్ | 326 | 311 | 15 | 291 | 35 |
| బోధన్ | 331 | 315 | 16 | 225 | 106 |

### ప్రభుత్వమే నిర్ణయం తీసుకోవాలి..

నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో సిబ్బంది కొరత ఉన్న మాట వాస్తవమే. ఖాళీల భర్తీపై రాష్ట్ర ప్రభుత్వమే నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు భర్తీ ప్రక్రియ ఉంటుంది. ఖాళీల వివరాలను ఇప్పటికే ప్రభుత్వానికి నివేదించాం.

**- రసూల్ బీ, నిజామాబాద్ జిల్లా సంక్షేమ అధికారిణి**

# అడవుల రక్షణకు కదిలిన 'గౌరారం'


అటవీ భూముల్లో వేసిన గుడిసెను తొలగిస్తున్న గౌరారం వాసులు

గాంధారి, ఆగస్టు 20: అన్యాక్రాంతమైపోతున్న అటవీ భూములను రక్షించడానికి ఓ పల్లె నడుం బిగించింది. ఆక్రమణకు గురైన అటవీ ప్రాంతాన్ని కాపాడుకునేందుకు ముందడుగు వేసింది. అడవుల సంరక్షణ కోసం ఊరు ఊరంతా ఏకమైంది. కబ్జాలను తొలగించి ఫారెస్టు భూములకు విముక్తి కల్పించింది. కామారెడ్డి జిల్లా గాంధారి మండలం గౌరారం గ్రామ శివారులో ఉన్న అటవీ భూములు క్రమంగా ఆక్రమణకు గురవుతున్నాయి. పచ్చని అడవి తల్లి కనుమరుగై పోతున్నదని ఆవేదనకు గురైన గ్రామస్తులు ఆలోచనలో పడ్డారు. ఆక్రమణలతో ఆవాసం కోల్పోయి అడవి జంతువులు ఊర్లల్లోకి వస్తున్నాయని గుర్తించిన స్థానికులు అడవుల సంరక్షణకు అండగా నిలబడాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ మేరకు మంగళవారం కార్యాచరణ కూడా ప్రారంభించారు. అటవీ భూముల్లోని చెట్లను అక్రమంగా సాగు చేస్తున్న పంటలను, అందులో వేసిన గుడిసెలను.. ఫారెస్టు అధికారులతో కలిసి తొలగించారు. చుట్టు పక్కల తండా వాసులు, గ్రామస్తులు అత్యాశతో అడవులను నరికి పంటలు సాగు చేస్తుండడంతో పర్యావరణం దెబ్బ తింటున్నదని గౌరారం వాసులు తెలిపారు. గ్రామ శివారులోని అటవీ భూములను నరికివేయడంతో దట్టమైన అడవి కనుమరుగై పోతున్నదన్నారు. పశువులకు మేత మేయడానికి స్థలం కరువైందని, అటవీ జంతువులకు సైతం రక్షణ లేక ఊరిలోకి వస్తున్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలోనే అడవుల సంరక్షణకు కదలాలని ఊరంతా కలిసి తీర్మానించామని వారు చెప్పారు. అడవుల రక్షణకు ముందుకొచ్చిన గౌరారం గ్రామస్తులను ఫారెస్టు సిబ్బంది అభినందించారు. చుట్టు పక్కల గ్రామస్తులు.. వారిని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు.

### వ్యవసాయ శాఖ సలహాదారుగా పోచారం

బాన్సువాడ, ఆగస్టు 20
రాష్ట్ర వ్యవసాయ శాఖ సలహాదారుగా మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు ఆయనకు క్యాబినెట్ హోదా కల్పిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత కేసీఆర్ ప్రభుత్వంలో పోచారం వ్యవసాయ శాఖ మంత్రిగా సేవలందించారు. రెండో విడుత కేసీఆర్ పాలనలో శాసనసభ స్పీకర్‌గా ఉన్నారు. తాజాగా రేవంత్ సర్కారు పోచారంను వ్యవసాయశాఖ సలహాదారుగా క్యాబినెట్ హోదా కల్పిస్తూ నిర్ణయం తీసుకుంది.

# బంకెట్‌హాల్ అడ్డాగా పేకాట

- బరి తెగించిన పేకాటరాయుళ్లు
- 35 మంది అరెస్టు, రూ.2.48 లక్షల స్వాధీనం


పట్టుబడిన నిందితులు, నగదుతో కమ్మర్‌పల్లి పోలీసులు

మోర్తాడ్, ఆగస్టు 20: పేకాట రాయుళ్లు బరి తెగించారు. ఏకంగా బంకెట్ హాల్‌ను రెంట్‌కు తీసుకుని పేకాట క్లబ్‌గా మార్చేశారు. దీనిపై ఉప్పందడంతో కమ్మర్‌పల్లి పోలీసులు సోమవారం అర్ధరాత్రి దాడి చేసి 35 మందిని అరెస్టు చేశారు. వీరి నుంచి నాలుగు కార్లు, ఒక బైక్, 35 సెల్‌ఫోన్లు, 228 కాయి న్లు, రూ.2,38,200 నగదును స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారిలో ఒకే ఒక వ్యక్తి కమ్మర్‌పల్లి మండలం నాగాపూర్ వాసి కాగా, మిగతా వారంతా మెట్‌పల్లి, మంచిర్యాల, బాన్సువాడ, బోధన్ ప్రాంతాలకు చెందిన వారిగా గుర్తించారు. మండల కేంద్రంలోని జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న బంకెట్ హాల్‌ను రెంట్‌కు తీసుకుని పేకాట క్లబ్బుగా మార్చిన వైనం పోలీసులను షాక్‌కు గురి చేసింది. దీనికి ప్రధాని సూత్రధారి నాగాపూర్ వాసిగా అనుమానిస్తున్నారు. అతడు గతంలో కూడా జిల్లా సరిహద్దులోని వివిధ ప్రాంతాల వారిని పిలిచి పేకాడించే వాడని తెలిసింది. ఇప్పుడు బంకెట్ హాల్‌ను రోజుకు రూ.2 వేల చొప్పున అద్దెకు తీసుకుని పేకాట శిబిరం కొనసాగిస్తున్నట్లు సమాచారం. కొంతకాలంగా సాగుతున్న ఈ తతంగంపై సమాచారం అందడంతో పోలీసులు సోమవారం అర్ధరాత్రి దాడి చేశారు. నిందితులపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అనిల్‌రెడ్డి తెలిపారు.

